క్లుప్తంగా

తెరుచుకున్న దేవాలయాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం మూసివేసిన దేవాలయాలను ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరిచారు. మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను అనుమతించారు. అలాగే అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణలతో సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం విశేషంగా అర్చనలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: స్రవంతి కృష్ణా ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్, తెలుగు కళావాహిని, ఇంద్రకీలాద్రి కల్చరల్ ఆర్ట్స్ అధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన తెలుగు హిందీ చిత్రగీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకుడు స్రవంతి కృష్ణ ఆధ్వర్యంలో విష్ణు ప్రియ సుశీల్‌కుమార్, భారతి, దుర్గానాగమణి, పి.శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావులు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. గాయకుడు స్రవంతి కృష్ణ మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు వేదికను కల్పించాల్సిన అవసముందన్నారు. సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, ప్రోగామ్ కన్వీనర్ కేఎస్ఎన్ మూర్తి, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకుడు సుశీల్‌కుమార్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూఫ్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిరుపేద విద్యార్థులకు ఆదివారం సాయంత్రం సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు వీలుగా ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో సైకిళ్ళను కొనుగోలు చేసి అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒకసారి సైకిళ్ళు పంపిణీ కార్యక్రమం నిర్వహించామని విద్యార్థుల కోరిక మేరకు తాము మరోమారు పాత సైకిళ్ళను కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హిరణ్య, సూరిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి




మధురానగర్(విజయవాడసెంట్రల్): నేరస్తులు, రౌడీ షీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని లేని పక్షంలో చర్యలు తప్పవని గుణదల సీఐ పి.కృష్ణ మోహన్ సూచించారు. స్థానిక మధురానగర్‌లోని గుణదల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు, నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరం చేసిన వారు ఎంతటి వారైనా పోలీసుల నుంచి తప్పించుకోలేరని అన్నారు. నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని కావున నేరాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నేరం చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుణదల పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు

పెనమలూరు: ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం కానూరు అశోక్‌నగర్‌లో వివరాలు తెలుపుతూ నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆక్యుపంక్చర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు, వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా
అమ్మ వారి ఊరేగింపు





మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశాలాంధ్ర రోడ్డు చలసాని చౌక్‌లో దేవీ శరన్నరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాలను ఆదివారం మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లు, డప్పు వాయిద్యాలు, కోలాటాలతో విశాలాంధ్ర రోడ్డు మొత్తం అమ్మ వారి నామస్మరణతో మారుమోగింది. అమ్మ వారి విగ్రహాలతో పాటు శివుడు, వెంకటేశ్వరస్వామి, వినాయకుడు విగ్రహాలను ఊరేగించారు. హంస వాహనంపై వస్తున్నట్లుగా ఉన్న దుర్గాదేవి సెట్టింగ్ ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొని అమ్మవారి విగ్రహాలను వీక్షించారు. ఉత్సవాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.





రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రొమ్ము క్యాన్సర్ లక్షణాలపై మహిళలకు అవగాహన అవసరమని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ శిఖినం అన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో పింక్ రిబ్బన్ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ శిఖినం మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. రూట్స్ సీనియర్ సభ్యురాలు డి.కరుణ శ్రీ మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు మమ్మోగ్రామ్ చేయించుకోవాలన్నారు. యుక్త వయస్సు నుంచి బాలికలకు సెల్ఫ్ ఎగ్జామినేషన్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా పింక్ బెలూన్స్‌గా ప్రదర్శన నిర్వహించి, కరపత్రాలు అందజేశారు. మహిళా కండక్టర్‌లకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు వెంకట రమణ, రంగా, జ్యోతి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

అమ్మవారి కృప కటాక్షం ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా
- ఘనంగా ముగిసిన శ్రీ దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి కృప కటాక్షం ప్రజలపై ఉండాలని.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆకాంక్షించారు. స్థానిక అజిత్ సింగ్‌నగర్‌లో శ్రీ కనకదుర్గ అమ్మవారి శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు కార్యక్రమం సమత మమత యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రుహుల్లా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం ఆయన కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళ తాళాలు డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి, 59వ డివిజన్ మైనారిటీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అజిత్ సింగ్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వయోవృద్ధ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆదిత్య చంద్రబొట్ల, డాక్టర్ ఏపీఎస్కే ప్రసాద్, డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరో గ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య పరిరక్షణకు వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నగరంలోని వయోవృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు గానూ అల్లోపతి, ఆయుర్వేదం, హోమియో వైద్య నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. దాతలు, ట్రస్ట్ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు శర్వాణీ ల్యాబొరేటరీ అధినేత, కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేశారు. సుమారు 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్‌కు డాక్టరేట్

పాయకాపురం(విజయవాడరూరల్): జిల్లా సైన్స్ అధికారి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మైనం హుస్సేన్‌కు సైన్సులో డాక్టరేట్‌ను పుదుచ్చేరిలో ఆదివారం గ్లోబల్‌పీస్ యూనివర్సిటీ అందజేసింది. ఈ విషయాన్ని జిల్లా సైన్సు అధికారి మైనం హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గత 23 సంవత్సరాలుగా జిల్లాలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా ప్రేరేపిస్తూ తాను స్వయంగా 10సార్లు జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణల్లో భాగంగా విద్యార్థుల్లో ఉన్నటువంటి నైపుణ్యాలను వెలికితీస్తూ బాలల సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పెయిర్, దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్, సైన్స్ సెమినార్, వరల్డ్ ఎన్విరాన్మెంటల్ డే, మ్యాథమెటిక్స్ డే, నేషనల్ సైన్స్ డే, గత 10 సంవత్సరాలుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక కార్యక్రమాల్లో హుస్సేన్ విరివిగా పాల్గొన్నట్టు తెలియజేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో సైన్స్ పేర్లలో అవార్డు సాధించిన కారణంగా డాక్టరేట్ ఇన్ సైన్స్‌ను తీసుకున్నారు.



డాక్టరేట్ స్వీకరిస్తున్న మైనం హుస్సేన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు కామయ్యతోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం షేక్ సుభానీ తాడిగడప వసంతనగర్ కాలువ కట్టపై ఉంటాడు. అతను టైర్లు పంక్చర్లు వేసే షాపు నిర్వహిస్తాడు. అతను టీ తాగేందుకు సైకిల్‌పై తాడిగడప నుంచి కామయ్యతోపు వైపునకు వస్తుండగా బైక్ అతనిని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడికి గాయాలయ్యాయి. బైక్‌తో ఢీ కొట్టిన వ్యక్తి ఆపకుండా వెళ్లిపోయాడు. బైక్ నంబర్ తెలియలేదు. గాయపడిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

6 నుంచి టైలరింగ్ శిక్షణ కొత్త బ్యాచ్ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 6వ తేదీ నుంచి టైలరింగ్ శిక్షణ కొత్త బ్యాచ్ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి టైలరింగ్‌లో 9 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో ఆసక్తి గలవారు 5వ తేదీలోగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 - 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): బయటకు వెళ్ళిన తన భర్త తిరిగి రాలేదని ఆదివారం ఇంజిరపు సంతోషి అనే మహిళ నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, కండ్రికలో భార్య ఇద్దరు పిల్లలతో వుంటున్న ఇంజిరపు వెంకటరమణ(30) ప్లంబర్ పని చేస్తుంటాడు. ఇంటి నుంచి బైక్‌పై శనివారం సాయంత్రం వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి కండ్రిక రాక

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి సోమవారం కండ్రిక వస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కెడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం వెల్లడించింది.

15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో నవంబర్ 15వ తేదీన నిర్వహించే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో ఆదివారం ప్రజా రక్షణ భేరి ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ దేశప్రజానీకాన్ని దెబ్బతీసిందన్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కరోనా, ఇప్పుడు కరోనా కంటే ప్రమాదకరంగా దేశాన్ని ప్రధాని మోదీ పట్టి పీడిస్తున్నారన్నారు. గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి పన్నుల పెంపు సర్వం భారంగా మారాయన్నారు. కేంద్రంలో బీజేపీ విధానాలపై సీపీఎం పోరాడుతుందన్నారు. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయని, నవంబర్ 15న సింగ్‌నగర్ ఎం.బి.స్టేడియంలో వేలాది మందితో జరిగే బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడిని ఖండిస్తూ నిరసన

భవానీపురం(విజయవాడపశ్చిమ): కావలి ప్రాంతంలో ఆర్టీసీ బస్ డ్రైవర్లపై అమానుషంగా దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయూ విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యాధరపురం ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కావలిలో ఆర్టీసీ బస్‌డ్రైవర్ బత్తుల రామ్ సింగ్‌ను అకారణంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని పోలీసులు, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈవీ నారాయణ, చౌదరి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దాసు, బాబూ ఖాన్, సాంబశివరావు, పుల్లారావు, రమేష్, కనకారావు పాల్గొన్నారు.

మారుతున్న జీవనశైలితోనే వ్యాధులు



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పెనమలూరు: అంతర్జాతీయ స్ట్రోక్ డే సందర్భంగా కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడప సెంటర్ నుంచి కానూరు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్టులు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా బ్రెయిన్, గుండె సంబంధిత వ్యాధులు అధికంగా నమోదు అవుతున్నాయని వివరించారు. గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌ల వలన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. పని ఒత్తిడి, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా ఉందని అన్నారు. స్ట్రోక్ వచ్చిన సమయంలో వెంటనే వైద్య సేవలు అందితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. వచ్చే వారం రోజుల పాటు కామినేనిలో ఉచిత న్యూరాలజీ హెల్త్ చెకప్ చేస్తామని పేర్కొన్నారు.

గ్యార్మీ పండుగలో పాల్గొనడం సంతోషదాయకం

పాయకాపురం(విజయవాడరూరల్): ఉరుసు గ్యార్మీ పండుగలో పాల్గొనడం సంతోషదాయకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్‌లో ఆదివారం రాత్రి జరిగిన గ్యార్మీ ఉరుసు పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నెల రోజుల పాటు ముస్లిం సోదరులు నిర్వహించుకునే పండుగను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే మల్లాది ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, యరగొర్ల శ్రీరాములు, అఫ్రోజ్, ఎస్‌కె ఇస్మాయిల్, మత పెద్దలు రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మ వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని అమ్మవారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక చుట్టుగుంటలో దుర్గాదేవి అమ్మవారిని ఎమ్మెల్యే మల్లాది ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న మందిర నిర్వాహకుడు పగడాల మధుసూధనరావును అభినందించారు. అనంతరం అమ్మవారి ప్రసాద వితరణను ప్రారంభించారు. తొలుత మందిర నిర్వాహకుడు మధుసూధనరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లుట్ల వంశీ, డివిజన్ కో–ఆర్డినేటర్ కోలా నాగాంజనేయులు, మెహర్, తోట పాండు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ ఆడిటర్ ఎంవీఎస్ రామచంద్రరావు అన్నారు. పాయకాపురంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. మానవత సేవా సంస్థ విజయవాడ శాఖ అధ్యక్షుడు ఇమ్మనేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామచంద్రరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని, మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. నిజ జీవితంలో స్థిరపడిన తర్వాత సమాజసేవ పట్ల ఆసక్తి చూపాలని తెలిపారు. గత విద్యాసంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రూ 4500 నగదు ప్రోత్సాహం, ప్రతిభ అవార్డులను అందజేశారు. జలం–జలసంరక్షణ, మాదకద్రవ్యాల వినియోగం–అనారోగ్య సమస్యలుపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన ఏడుగురు విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రం, నగదు బహుమతిని అందించారు. అమరావతి రేర్ డేసీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు ఎస్.శోభరాణికి రూ 25వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.సాంబశివరావు, టి.శ్రీనివాసరావు, సిబిజి బాబు, యశోద తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

బీఆర్‌టీఎస్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల వాక్‌థాన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం ఆధ్వర్యాన విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా వాక్‌థాన్ నిర్వహించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కాలేజి నుంచి ప్రారంభమై మధురానగర్ సిగ్నల్ వరకు వాక్‌థాన్ జరిగింది. వాక్‌థాన్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జనరల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు, రీజనల్ హెడ్ శ్రీధర్ ముంబాయి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి సచిన్‌దేవ్ పాల్గొని విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం గురించి వివరించారు. వినియోగదారుల అభిరుచులు అవసరాలకు అనుగుణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అందిస్తుందన్నారు. వినియోగదారుల నమ్మకం ప్రయోజనాలే ధ్యేయంగా తాము పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వాక్‌థాన్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల వాక్‌థాన్